

# చైతన్యరథం

నిజాయితీ దేశాలయం, ప్రజల దేవుళ్ళు



## అర్చకుల కనీస వేతనం పెంపు

- దేవాదాయ మంత్రి ఆనం వెల్లడి

6



# మూడేళ్లలో పోలవరం పూర్తి

- 2026 జూన్లో ప్రాజెక్టు పూర్తి చేసేలా ప్రణాళిక
- కొత్త డయాఫ్రం వాల్, ఈసీఆర్ఎఫ్ డ్యాంపై చర్చ
- జనవరిలో పనులు శ్రీకారానికి సన్నాహాలు
- నూతన డయాఫ్రం వాల్ పొడవు 1396 మీటర్లు
- సాధ్యమైనంత త్వరలో పోలవరం ఫలాలు..
- నిర్దేశిత లక్ష్యాన్ని సమన్వయంతో సాధిద్దాం..
- అధికారులు, నిర్మాణ సంస్థలకు సీఎం దిశానిర్దేశం
- ప్రాజెక్టు కీలక అంశాలపై ఉన్నతస్థాయి సమీక్ష

2

## 6న ఏపీ కేబినెట్ భేటీ

- క్యాబినెట్ గ్రాంటింగ్ యాక్ట్ 1982 సవరణకు ఆమోదం
- రాష్ట్రంలో ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ యాక్టు 2024
- వైసీపీ భూదందాలు నిగ్గు తేల్చడానికే..
- పోర్ట్స్, ట్రేడ్, టూరిజం ప్రాజెక్టులపై చర్చించే అవకాశం

6

## డ్రోన్స్ కేపిటల్‌గా ఏపీ

- ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలి
- డ్రోన్ ఇండస్ట్రీకి ప్రోత్సాహకాలు
- భారీ పెట్టుబడులు ఆకర్షించే లక్ష్యం..
- మంత్రులు, అధికారులకు సీఎం దిశానిర్దేశం
- ఏపీ డ్రోన్ పాలసీపై చంద్రబాబు సమీక్ష

4

## పారదర్శకంగా మెగా డీఎస్సీ

- పకడ్బందీ ఏర్పాట్లకు మంత్రి లోకేష్ ఆదేశం
- 116 ఉత్తమ టీచర్లకు అవార్డుల ప్రదానం

4

- ప్రైవేటు సంస్థలకు దీటుగా ప్రభుత్వ కాలేజీలు
- పాఠశాల, ఇంటర్ విద్య అధికారులతో లోకేష్ సమీక్ష



4

## మండలానికో ఇంటర్ కాలేజ్

- త్వరితగతిన ప్రణాళికలు సిద్ధం చేయండి
- ఇంటర్ ఉత్తీర్ణత శాతం పెంపునకు చర్యలు
- స్టూడెంట్స్ లెర్నింగ్ అవుట్ కమ్స్‌పై దృష్టి పెట్టాలి
- ఇంటర్ విద్యపై సమీక్షలో మంత్రి నారా లోకేష్

## తప్పులు జరిగిన మాట నిజం

పోర్టు ఆఫీసుపై దాడి కేసును అప్పటి పోలీసులు నీరుగార్చారు: డీజీపీ

6

## 'సరస్వతి'పై సమగ్ర విచారణ

- బెదిరించి విసిరి భూములు లాక్కున్నారు
- పవర్‌ప్లాంట్ భూములపై నిగ్గు తేలుస్తాం
- రైతులకు అండగా నిలబడతాం..
- వైసీపీ అధికారంలో ఉన్నట్లే భావిస్తోంది
- ఇష్టారీతిన మాట్లాడితే సహించేది లేదు..
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హెచ్చరిక

7



## క్యాన్సర్‌కు కూటమి చెక్!

- స్క్రీనింగ్ సర్వేకు రంగం సిద్ధం
- ఏటా లక్షల్లో క్యాన్సర్ కేసులు
- నేడు క్యాన్సర్ సర్వేకు శ్రీకారం

5

## పోలీసు వ్యవస్థ పటిష్టం

- సాంకేతికంగా బలోపేతం చేస్తాం
- వైసీపీ అరాచకాలకు చరమగీతం
- జగన్ పాలనలో గాడితప్పిన వ్యవస్థ
- డీజీపీగా బాధ్యతలు చేపట్టిన ద్వారకా తిరుమలరావు

7





## వైసీపీ ఎంపీ గ్యాంగ్ అరాచకం

- అధికార యంత్రాంగం అండతో భూకబ్జాలు
- అధికారం అండతో భూములు ఆక్రమణ
- టీడీపీ కార్యాలయంలో వినతుల స్వీకరణ

8

చైతన్యరథం

# 2028 మార్చి నాటికి పోలవరం పూర్తి

## - ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష

**జనవరి నుంచి 1,396 మీటర్ల పొడవుతో కొత్త డయాఫ్రం వాల్, ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులపై చర్చ - నీరందించేవరకు ప్రతిరోజూ కీలకమే**





అమరావతి చైతన్యరథం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో తలెత్తిన సమస్యలను అధిగమించి పనులు ప్రారంభించేందుకు గత నాలుగు నెలలుగా తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రి సమీక్షించారు. వివిధ దశల్లో రావాల్సిన అనుమతులు, సాంకేతిక, ఆర్థిక సమస్యలు, సవాళ్లపై అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి సుదీర్ఘంగా చర్చించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టిన పనుల గురించి ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఈసిఆర్ఎఫ్ డ్యాం గ్యాప్ 2 పనుల్లో డీవాటరింగ్ పనుల పురోగతిని వివరించారు. డీ వాటరింగ్ పనుల ద్వారా డయాఫ్రం వాల్ పనులు చేపట్టడానికి అనువైన పరిస్థితి ఏర్పడిందని అధికారులు వివరించారు. డయాఫ్రం వాల్ డిజైన్లపై అనుమతి కోసం గత నెల 24 తేదీన సీడబ్ల్యుసీకి పంపినట్లు అధికారులు తెలిపారు. 1,396 మీటర్ల పొడవైన డయాఫ్రం వాల్ 1.5 మీటర్ల వెడల్పుతో నిర్మించాల్సి ఉందన్నారు. కొన్ని చోట్ల 10 మీటర్ల లోతులో....కొన్ని చోట్ల 90 మీటర్ల పైగా లోతులో నిర్మాణం ఉంటుందని అధికారులు తెలిపారు. మొత్తం 63,356 చదరపు మీటర్ల ఏరియాలో డయాఫ్రం వాల్ నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. సాంకేతిక పరమైన అంశాలపై రేపటి నుంచి 9వ తేదీ వరకు పోలవరంలో జరిగే వర్క్ షాప్ అనంతరం క్లారిటీ వస్తుందని అధికారులు తెలిపారు. సిడబ్ల్యుసితో చర్చలు జరిపి డయాఫ్రం వాల్ పనులు, ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులు సమాంతరంగా చేపట్టడానికి ఉన్న అవకాశాలు పరిశీలించాలని సీఎం సూచించారు. జనవరిలో డయాఫ్రం వాల్ పనులు ప్రారంభిస్తే పూర్తి కావడానికి సరిగ్గా ఏడాది పడుతుందని నిర్మాణ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆ తరువాత ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులు మొదలు పెడితే 24 నెలలు పడుతుందని వివరించారు. సమాంతరంగా పనులు చేపడితే 2027 జూలై నాటికి, విడివిడిగా పనులు చేపడితే 2028 మార్చి నాటికి పనులు పూర్తి చేయవచ్చని తెలిపారు. పనులు త్వరగా పూర్తి చేయడంతో పాటు, నాణ్యత కూడా ముఖ్యమని....నిబంధనలకు అనుగుణంగా, ఎక్కడా డీవియేషన్ అనేది లేకుండా పనులు చేపట్టాలని సిఎం అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు 77 శాతం ఎడమ కాలువ పనులు పూర్తి అయ్యాయని...రూ.960 కోట్ల పనులకు టెండర్లు పిలిచామని....డిసెంబర్ నుంచి పనులు ప్రారంభించి.....2025 జూలై నాటికి పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ఫేజ్ 1 లో భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ పనులకు రూ.7,213 కోట్లు అవసరం అని అధికారులు వివరించారు. ఫేజ్ 1 పూర్తికి ఇంకా 16,440 ఎకరాల భూసేకరణ జరపాల్సి ఉందని అధికారులు తెలిపారు. 2025 ఏప్రిల్ నాటికి భూసేకరణ, 2026 ఏప్రిల్ నాటికి ఆర్ అండ్ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణ పనులతో పాటు ఈ పనులు కూడా సమాంతరంగా జరగాలని, దీనికి అవసరమైన నిధులు ఎప్పటికప్పుడు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. పోలవరం కుడి కాలువ సామర్థ్యాన్ని 30 వేల క్యూసెక్కులకు తీసుకువెళ్లాలనే అంశంపైనా చర్చించారు. కొత్తగా మరో కాలువ నిర్మించడమా...ఉన్న కాలువను విస్తరించడమా అనే అంశాన్నీ చర్చించామన్నారు. ప్రాజెక్టుతో పాటు నాడు అనుకున్న విధంగా పోలవరంపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం కూడా చేపట్టాలని సిఎం సూచించారు. మరోవైపు కాలువ కట్టలను కూడా బలోపేతం చేసుకుని నీటి తరలింపునకు సిద్ధం చేయాలని అన్నారు. పవర్ ప్రాజెక్టు పనులు కూడా ముందుగా పూర్తి చేసేందుకు ప్రయత్నం చేయాలని ఆదేశించారు. ఈ నెలలో పోలవరం సందర్శనకు వచ్చి.....పనులపై ప్రణాళిక విడుదల చేస్తానని సిఎం అన్నారు.

### చింతలపూడి లిఫ్ట్ పనులు వేగవంతం

అనంతరం చింతపూడి లిఫ్ట్ పనులపైనా సీఎంకు అధికారులు వివరించారు. 3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.2,463 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని అధికారులు వివరించగా....ఆ పనులు పూర్తి చెయాలని సిఎం సూచించారు. అనంతరం వెలిగొండ పనులపైనా సీఎం సమీక్ష నిర్వహించారు. ఇంకా రూ.2,200 కోట్ల విలువైన పనులు పెండింగ్ లో ఉండగానే వెలిగొండ పూర్తి అంటూ నాడు జగన్ ప్రారంభించాడని మంత్రి రామానాయుడు పేర్కొన్నారు. ప్రాజెక్టు ఫలాలు అందాలంటే ఇంకా రూ.2,211 కోట్ల నిధులు, రెండేళ్ల కాలపరిమితి అవసరం ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని...దీనికి అవసరమైన ప్రణాళికతో రావాలని అధికారులకు సూచించారు. గోదావరి పెన్నా లింకేజ్ పనులకు అవసరమైన భూసేకరణ పనులు చేపట్టాలని సిఎం సూచించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు, మేఘా, బావర్ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న "సీ ప్లేన్ డెమో లాంఛ్" కార్యక్రమానికి సీఎం చంద్రబాబుని ఆహ్వానిస్తున్న రోడ్లు భవనాలు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కార్యదర్శి సురేష్ కుమార్. ఈనెల 9న విజయవాడలోని పున్నమి ఘాట్‌లో "స్కై మీట్స్ సీ" పేరిట కార్యక్రమం నిర్వహించనున్నారు. విజయవాడ -శ్రీశైలం మధ్య ప్రయోగాత్మకంగా సీ ప్లేన్ సర్వీసు చేపట్టనున్నారు.



## నేడు సీఎం అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత స్థాయి సమావేశం

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు సిద్ధం చేసిన పది సూత్రాల ప్రణాళికపై విస్తృత చర్చకు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతస్థాయి సమావేశం బుధవారం నిర్వహించనున్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి మండల స్థాయి అధికారుల వరకూ హాజరవుతారు. రాష్ట్ర సచివాలయంనుంచి మంత్రులు, సెక్రటరీలు, హెచ్వోడీలు హాజరైతే.. ఆన్‌లైన్‌లో జిల్లాల నుంచి కలెక్టర్లు, ఎస్పీలు, జిల్లా, మండలస్థాయి అధికారులు హాజరవుతారు. ప్రభుత్వ ప్రాధాన్యాలు, లక్ష్యాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమస్త అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేయనున్నారు. సింపుల్ గవర్నమెంట్... ఎఫెక్టివ్ గవర్నెన్స్ అనే అంశంపై సమావేశం సాగనుంది. ప్రజల అర్జీల సత్వర పరిష్కారం, ప్రభుత్వ నిర్ణయాల అమలులో వేగం పెంచడం, వ్యవస్థలను తిరిగి గాడిన పెట్టడం, ప్రభుత్వ విభాగాల్లో జవాబుదారీతనం తీసుకురావడంపై సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేస్తారు. రాష్ట్ర అభివృద్ధికి 10 సూత్రాలతో ప్రణాళికి సిద్ధం చేసిన సీఎం.. ఈ లక్ష్యాల సాధనకు ఆయా శాఖల్లో తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చిస్తారు. దానికి అనుగుణంగా రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ప్రభుత్వ యంత్రాంగాన్ని సన్నద్ధం చేయడానికే సమావేశం నిర్వహిస్తున్నారు. కేబినెట్ అనంతరం జరగనున్న ప్రభుత్వ ఉన్నతస్థాయి సమావేశం ఇదే.



## సీఎం చంద్రబాబును కలిసిన మందకృష్ణ మాదిగ

అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ భేటీ అయ్యారు. వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసిన మందకృష్ణ పలు అంశాలపై సీఎంకు వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుతోపాటు వివిధ అంశాలపై సీఎంతో చర్చించారు. మందకృష్ణ తన దృష్టికి తీసుకొచ్చిన అంశాలపై సీఎం సానుకూలంగా స్పందించారు.

## రెడ్డి సత్యనారాయణ మృతి బాధాకరం

### - సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి (చైతన్య రథం): మాజీమంత్రి, టీడీపీ సీనియర్ నేత రెడ్డి సత్యనారాయణ మృతిపట్ల సీఎం చంద్రబాబు సంతాపం తెలిపారు. ఐదుసార్లు వరుసగా ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా చేసిన సత్యనారాయణ.. నిరాడంబరత్వానికి నిలువెత్తు నిదర్శనమంటూ నివాళి అర్పించారు. మాడుగుల నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేసి, నియోజకవర్గ ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్న సత్యనారాయణ మృతి తీవ్ర విచారం కలిగించిందన్నారు. మంత్రిగా పనిచేసి పదవులకు వన్నె తెచ్చిన వ్యక్తిగా గుర్తు చేసుకుంటూ.. కుటుంబ సభ్యులకు సీఎం ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

## ముప్పైయేళ్ల చంద్రన్న స్మార్ట్ అండ్ హార్డ్‌వర్క్

# అభివృద్ధి.. సంక్షేమం.. సామాజిక న్యాయానికి పట్టం

సెప్టెంబరు 1, 1995న శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు ముఖ్యమంత్రిగా తొలుత బాధ్యతలు చేపట్టి సెప్టెంబరు 1, 2024 నాటికి 30వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంలో.. మహోజ్వల విజయాలు కొన్ని.

## విజనరీ లీడర్ మన చంద్రన్న




## పారిశ్రామిక విప్లవం - సంపద సృష్టి

1. హైటెక్ టవర్, జినోమ్ వ్యాలీ, బయోటెక్నాలజీ పార్క్‌నిర్మించి హైదరాబాద్‌ను ప్రపంచపటంలో పెట్టారు.
2. నవ్యాంధ్రలో రూ.5 లక్షల కోట్లు పెట్టుబడులు ఆకర్షించి 5.13 లక్షల ఉద్యోగాల కల్పన.
3. 4,31,000 కియా కార్లు మన రాష్ట్రంలో ఉత్పత్తి - కియాలో ప్రత్యేకంగా 5,500 ఉద్యోగాలు, అనుబంధ పరిశ్రమలు ద్వారా 18 వేల మందికి ఉద్యోగాలు, ఉపాధి లభిస్తుంది.
4. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక నగరాల అభివృద్ధికి కేంద్ర క్యాబినేట్ ఆమోదం సాధించడమైంది - వీటి ద్వారా లక్ష మందికి ఉద్యోగాలు, ఉపాధి.
5. కృష్ణపట్నంలో పారిశ్రామిక హబ్, నక్కపల్లిలో ఫార్మాసిటీలు వస్తాయి.
6. రూ.50 వేల కోట్లు పెట్టుబడులతో ఐటి పరిశ్రమలు రానున్నాయి.
7. జగన్ పాలనలో పరిశ్రమలపై దాడులు చేసి పెట్టుబడులు పొరుగు రాష్ట్రాలకు తరిమేశారు



# డ్రోన్స్ కేపిటల్‌గా ఏపీ

- ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలి
- డ్రోన్ ఇండస్ట్రీకి తగిన ప్రోత్సాహకాలు
- భారీ పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం..
- ప్రభుత్వ శాఖల్లో డ్రోన్ల వినియోగంపై దృష్టి
- ముసాయిదా రూపకల్పనపై సీఎం దిశానిర్దేశం
- ఏపీ డ్రోన్ పాలసీపై చంద్రబాబు సమీక్ష





అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తున్న డ్రోన్ పాలసీ దేశంలోనే అత్యుత్తమ డ్రోన్ పాలసీగా ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఏపీ డ్రోన్స్ కార్పొరేషన్ సంస్థ ఐదేళ్లలో చేపట్టాల్సిన లక్ష్యాలతో రూపొందించిన ఏపీ డ్రోన్ పాలసీ 2024-2029 ముసాయిదా పాలసీపై సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్షించారు. రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి ఎస్ సురేష్‌కుమార్, ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఎండీ కె దినేష్ కుమార్‌లు ఈ పాలసీ గురించి ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ మన రాష్ట్రం రూపొందిస్తున్న డ్రోన్ పాలసీ దేశంలోనే అత్యుత్తమ డ్రోన్ పాలసీగా ఉండాలని సూచించారు. దేశంలో డ్రోన్ పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ కేంద్రం కావాలన్నారు. డ్రోన్ తయారీ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చే సంస్థలకు మంచి ప్రోత్సహకాలు ఇచ్చి ఈ రంగంలో భారీగా పెట్టుబడులు ఆకర్షించాలని సూచించారు. కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లును డ్రోన్ తయారీ పరిశ్రమలు నెలకొల్పడానికి అనుకూలమైందిగా అభివృద్ధి చేయడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. డ్రోన్ల రంగంలో విస్తృతంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలిగేలా పాలసీలో విధాన రూపకల్పనలుండాలన్నారు. డ్రోన్ తయారీ, సేవల రంగానికి సంబంధించి ఏపీలో ఒక మంచి వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ వీలైనన్నిచోట్ల వీలైనంతమేర డ్రోన్ సేవలను వినియోగించుకునేలా చూడాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో డ్రోన్లు ఎలా ఉపయోగించుకోవాలి అనే దానిపై ఆయా శాఖల్లో అవగాహన కల్పించాలని, తద్వారా ఆ శాఖలుకూడా డ్రోన్ల వినియోగాన్ని పెంచుకోవడానికి దోహదపడాలన్నారు. రాష్ట్రంలో డ్రోన్ల రంగానికి సంబంధించి రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ పరంగా కూడా ఏపీలో తగిన అనుకూల వాతావరణం ఉండేలా చూడాలని తెలిపారు. ఒక మంచి అనుకూల వాతావరణం ఏర్పాటు చేయడం ద్వారా డ్రోన్ తయారీ పరిశ్రమలన్నీ కూడా ఏపీవైపు చూసేలా చేయొచ్చునని దిశానిర్దేశం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని దేశంలోనే డ్రోన్ క్యాపిటల్ సిటీగా అభివృద్ధి చేయాలని, ఆ దిశగా కూడా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో రాష్ట్ర పెట్టుబడులు మౌలిక సదుపాయాల కల్పన శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# మండలానికో ఇంటర్ కాలేజ్

- త్వరితగతిన ప్రణాళికలు సిద్ధం చేయండి
- ఇంటర్ ఉత్తీర్ణత శాతం పెంపునకు చర్యలు
- స్టూడెంట్స్ లెర్నింగ్ అవుట్ కమ్స్‌పై దృష్టి పెట్టాలి
- ఇంటర్ విద్యపై సమీక్షలో మంత్రి లోకేష్

అమరావతి (చైతన్యరథం): 'ఇంటర్మీడియట్ కళాశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో మండలానికో ఇంటర్ కళాశాల ఏర్పాటునకు ప్రణాళికలు రూపొందించాలని' విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఉండవల్లిలోని నివాసంలో ఇంటర్ విద్యపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ కాలేజీల్లో స్టూడెంట్స్ లెర్నింగ్ అవుట్ కమ్స్‌పై దృష్టి సారించాలన్నారు. ప్రైవేటు కాలేజీలకు ధీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉత్తీర్ణత శాతం పెంపునకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివి ఐఐటీ, మెడిసిన్‌వంటి పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల ఫోటోలను దినపత్రికల్లో ప్రచురించేలా కసరత్తు చేయాలన్నారు. రిమోట్ ప్రాంతాల్లో జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేసే వారికి త్వరితగతిన అనుమతులు అందించాలన్నారు. ఈ ఏడాది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించడం వల్ల 15వేల వరకు అడ్మిషన్లు పెరిగాయనే విషయాన్ని అధికారులు మంత్రికి వివరించారు. వచ్చే ఏడాది 2 లక్షల వరకు అడ్మిషన్లు పెరిగేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. జూనియర్ కాలేజీల్లో పనివేళలు పెంచడంతోపాటు విద్యార్థుల హాజరుపై సమీక్ష, ప్రోగెస్ కార్డులను అందిస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఉత్తమ అధ్యాపకులతో విద్యార్థులకు బ్రిడ్జ్ కోర్సులకు శిక్షణ ఇప్పించాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. వచ్చే ఏడాది నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎన్సీఈఆర్టీ బుక్స్ ప్రవేశపెట్టడంతో పాటు ప్రశ్నాపత్రంలోనూ మార్పులు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ విజయరామరాజు, ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ కృతికా శుక్లా, సమగ్ర శిక్ష అభియాన్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా మెగా డీఎస్సీ

- పకడ్బంధీ ఏర్పాట్లకు మంత్రి లోకేష్ ఆదేశం
- 11న ఉత్తమ టీచర్లకు అవార్డుల ప్రదానం
- ప్రైవేటు సంస్థలకు దీటుగా ప్రభుత్వ కాలేజీలు
- పాఠశాల, ఇంటర్ విద్య అధికారులతో లోకేష్ సమీక్ష



అమరావతి: రాష్ట్రంలో టెట్ -2024 విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో మెగా డీఎస్సీ పారదర్శక నిర్వహణకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. స్కూల్ ఎడ్యుకేషన్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్‌పై మంత్రి లోకేష్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మెగా డీఎస్సీ నిర్వహణ విధివిధానాలపై సమావేశంలో చర్చించారు. సాధ్యమైనంత ఎక్కువమంది అభ్యర్థులకు అవకాశం కల్పించాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. రాష్ట్రంలోని ఉత్తమ ఉపాధ్యాయులకు ఈనెల 11న నిర్వహించే కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇవ్వాలని నిర్ణయించారు. పాఠశాలల్లో విద్యాప్రమాణాల మెరుగుపర్చే చర్యల్లో భాగంగా తల్లిదండ్రులను భాగస్వాములను చేస్తూ డిసెంబర్ మొదటివారంలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించాలని మంత్రి లోకేష్ సూచించారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు పూర్తిచేయాలన్నారు. రాష్ట్రంలో పాఠశాల విద్యార్థులకు అపార్ ఐడి కార్యక్రమం ఇప్పటివరకు 57.48శాతం పూర్తయిందని అధికారులు తెలుపగా, సాధ్యమైనంత త్వరగా ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ రిపోర్టు కార్డులు అందజేయాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ ర్యాంకింగ్స్‌పై దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలో ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని, ఇందులో భాగంగా అటెండెన్స్ మెరుగుదలకు చర్య తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని స్కూళ్లలో కనీస మౌలిక సదుపాయాలైన టాయ్‌లెట్స్, వాటర్, బెంచీలు, లీక్ ప్రూఫ్ భవనాలు, పెయింటింగ్స్ వంటివాటిపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రం మొత్తాన్ని నాలుగుజోన్లుగా విభజించి విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో మెనూలో మార్పులు చేసే అంశాన్ని పరిశీలించాలని అన్నారు. వచ్చే ఏడాదికల్లా మండలానికో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో పాస్ పర్సంటేజి మెరుగుదలపై దృష్టి సారించాలన్నారు. ఇందుకోసం అవసరమైతే వెనుకబడిన విద్యార్థులకు బ్రిడ్జి కోర్సులు నిర్వహించాలని మంత్రి లోకేష్ సూచించారు.

ఇంటర్మీడియట్ విద్యార్థుల ప్రశ్నాపత్రాలను ఏఐ ద్వారా ఎవాల్యుయేషన్ చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో రాష్ట్ర పాఠశాల విద్యా కార్యదర్శి కోన శశిధర్, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ విజయరామరాజు, ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ కృతికా శుక్లా, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# క్యాన్సర్‌కు కూటమి చెక్ !



- హృద్రోగ సమస్య నియంత్రణపైనా సర్కారు యుద్ధం
- ఏటా రాష్ట్రంలో క్యాన్సర్ మరణాలు 40వేలు
- మొత్తం మరణాల్లో మూడోవంతు గుండె సమస్యతోనే..
- నేడు క్యాన్సర్ పరీక్షలు, స్టెమికి శ్రీకారం చుట్టనున్న చంద్రబాబు

అమరావతి (చైతన్య రథం): క్యాన్సర్, గుండెపోటు వలన దేశంలోనేకాక రాష్ట్రవ్యాప్తంగా మరణాలు రోజురోజుకూ పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మన రాష్ట్రంలో ఏటా 73 వేలకుపైగా కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతుండగా, 40 వేలకుపైగా మృతి చెందుతున్నారు. దేశవ్యాప్తంగా ఏటా 14 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతుంటే, 9 లక్షలమంది మృత్యువాత పడుతున్నారు. రాష్ట్రంలో క్యాన్సర్ చికిత్సకు రాష్ట్ర ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరంలో రూ.680 కోట్లకు పైగా ఖర్చు చేసింది.

సార్వత్రిక క్యాన్సర్ పరీక్షల కార్యక్రమం

ప్రబలుతున్న క్యాన్సర్ వ్యాధిని అరికట్టడానికి కూటమి ప్రభుత్వం నడుంకట్టింది. మహమ్మారిని అదుపు చేయడానికి ఉద్దేశించిన "సార్వత్రిక క్యాన్సర్ పరీక్షల కార్యక్రమాన్ని" రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా క్యాన్సర్ మృతికి ప్రధాన కారకాలైన నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్ పరీక్షల్ని రాష్ట్రవ్యాప్తంగా చేపడతారు. 18 ఏళ్లుదాటిన ప్రతి ఒక్కరూ పరీక్ష చేయించుకోవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ప్రజలకు విజ్ఞప్తి చేస్తోంది.

రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సిహెచ్వోలు), ఏఎన్ఎంలు ప్రతి ఇంటికీ వెళ్లి మూడు రకాల క్యాన్సర్ పరీక్షలు చేస్తారు. ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్ సహాయంతో క్యాన్సర్ పరీక్షల ఫలితాల్ని ప్రభుత్వ బోధానాసుపత్రులు మరియు యన్టీఆర్ వైద్యసేవలో భాగస్వాములైన ఆసుపత్రులకు పంపి అక్కడ చికిత్స పొందే ఏర్పాటు కలగజేస్తారు. క్యాన్సర్‌కు గురై చికిత్స కోసం వెళ్లే ప్రతి రోగివెంట ఆశా కార్యకర్త ఉంటారు. మొదట్లోనే క్యాన్సర్ లక్షణాల్ని గుర్తించడంవల్ల సకాలంలో చికిత్సను అందించడంతోపాటు వ్యాధికి గురైన వారు అతి స్వల్ప ఖర్చుతో కోలుకునే వీలుంటుంది.

స్టెమి (ఎస్టీ-ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్‌ఫార్క్షన్)

గుండె నొప్పి సంకేతం అందిన కీలకమైన మొదటి గంట సమయంలో తగు చర్యలు తీసుకుంటే గుండెపోటు మరణాల్ని నివారించవచ్చన్న శాస్త్ర సాంకేతిక అంశం ఆధారంగా ఈ దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా స్టెమి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. గుండెపోటు వల్ల గుండె కండరాలకు జరిగే నష్టాన్ని తగ్గించి బాధితుల్ని రక్షించడం ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశం.

238 స్పోక్స్ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు) మరియు 37 హబ్ ఆసుపత్రులు (11 ప్రభుత్వ సర్వజనాసుపత్రులు, 26 యన్టీఆర్ వైద్య సేవా ప్రైవేట్ ఆసుపత్రులు) ద్వారా ఈ కార్యక్రమం అమలుకానుంది. ఈ కార్యక్రమం అమలుకు కూడా ప్రత్యేక యాప్ రూపొందించారు. గుండె నొప్పి వచ్చిన వ్యక్తి ఆ సమాచారాన్ని స్పోక్ ఆసుపత్రికి తెలియజేస్తే అక్కడ ఉన్న వైద్యాధికారి వెంటనే ఇసిజి తీసి మొబైల్ యాప్ ద్వారా హబ్ ఆసుపత్రికి పరిస్థితిని తెలియజేస్తారు. హబ్ ఆసుపత్రిలో ఉండే హృద్రోగ నిపుణుడు నివేదికను పరిశీలించి, గుండెకు రక్తప్రసరణ సరిగా జరిగేందుకు అవసరం మేరకు టెనెక్టిప్లేజ్ ఇంజక్షన్ చేయడంపై సలహా ఇస్తారు. ఈ ఇంజక్షన్ అనంతరం రోగి పరిస్థితి సాధారణ స్థితికి వచ్చిన వెంటనే రోగిని తగు చికిత్సకోసం హబ్ ఆసుపత్రికి పంపడం జరుగుతుంది. ఎంతో కీలకమైన ఈ ఇంజక్షన్ ఖరీదు రూ.45,000. ఈవిధంగా గుండె నొప్పి సంకేతం అందిన వెంటనే బాధితుని గుండెకు రక్త సరఫరాలో అడ్డంకుల్ని తొలగించి చికిత్సకు వీలు కలిగించడంవల్ల ప్రాణ రక్షణ వీలవుతుంది.

ఈ రెండు ప్రధాన కార్యక్రమాల అమలుకు సంబంధించిన వివిధ అంశాల్ని వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు మరియు సంబంధిత ఉన్నతాధికారులతో మంగళవారం విస్తృతంగా చర్చించారు.





### సీఎం చంద్రబాబు సమక్షంలో

## టీడీపీలోకి కుప్పం మున్సిపల్ చైర్మన్

### పదవులకు రాజీనామా చేసి టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించిన సుధీర్

అమరావతి (చైతన్య రథం): కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ టీడీపీలో చేరారు. ఉండవల్లి నివాసంలో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసి సుధీర్ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ కండువా కప్పి సుధీర్‌ను చంద్రబాబు పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీకి, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ పదవులకు రాజీనామా చేసిన అనంతరం సుధీర్ టీడీపీలో చేరారు. చంద్రబాబుతోనే కుప్పం సమగ్రాభివృద్ధి సాధ్యమని తామంతా నమ్ముతున్నామని సుధీర్ వ్యాఖ్యానించారు. సీఎం చంద్రబాబుతో కలిసి నడిచేందుకే అన్ని పదవులకు రాజీనామా చేశానని సుధీర్ తెలిపారు.



# బెస్ట్ స్పోర్ట్స్ పాలసీ మనదే

### - క్రీడా మంత్రి మండిపల్లి ఉద్ఘాటన




విజయవాడ (చైతన్య రథం): దేశంలోనే అత్యుత్తమ క్రీడావిధానాన్ని రూపొందించామని, క్రీడా సంఘాల తోడ్పాటుతో క్రీడా పోటీల నిర్వహణ శుభపరిణామమని క్రీడా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న కాస వడ్లమూడి మోహనకృష్ణ మెమోరియల్ ఏపీ స్టేట్ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ అండర్ -13 క్రీడల పోటీల కార్యక్రమానికి మంత్రి మండిపల్లి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఇండోర్ స్టేడియాల నిర్మాణానికి కట్టుబడి ఉన్నామన్నారు. అమరావతిలో దేశంలోనే అత్యుత్తమ స్పోర్ట్స్ హబ్ నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ముందడుగు వేస్తున్నారన్నారు.

తొలుత మోహనకృష్ణ చిత్రపటానికి మంత్రి నివాళులర్పించారు. నిర్వాహకులు మంత్రి, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ నాయుడుని ఘనంగా సన్మానించారు. క్రీడాకారులకు కూటమి ప్రభుత్వహయాంలో అన్ని విధాలా తోడ్పాటు అందిస్తామని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం విజయవాడ ఈస్ట్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ నాయుడు, మంత్రి రాంప్రసాద్ కొంతసేపు బ్యాడ్మింటన్ ఆడి.. క్రీడాకారులను ఉత్సాహపర్చారు.





# 'సరస్వతి'పై సమగ్ర విచారణ



- బాంబులు విసిరి భూములు లాక్కున్నారు
- పవర్‌ప్లాంట్ భూములపై నిగ్గు తేలుస్తాం
- రైతులకు అండగా నిలబడతాం..
- వైసీపీ అధికారంలో ఉన్నట్టే భావిస్తోంది
- ఇష్టారీతిన మాట్లాడితే సహించేది లేదు..
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హెచ్చరిక

మాచవరం (చైతన్య రథం): ప్రజల ఆస్తులు లాక్కొని.. తమ సొంత ఆస్తిలా భావించి జగన్ కుటుంబీకులు కొట్లాడుకుంటున్నారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విమర్శించారు. వైకాపా నాయకులు ఇంకా అధికారంలో ఉన్నామనే భావిస్తున్నారని, ఎవరైనా ఇష్టారీతిన మాట్లాడితే ఊరుకునేది లేదని పవన్ హెచ్చరించారు. పల్నాడు జిల్లా మాచవరం మండలం వేమవరం, చెన్నాయపాలెంలోని సరస్వతి పవర్ భూములను పవన్ మంగళవారం పరిశీలించారు. ఆయనవెంట ఎమ్మెల్యే యరపతినేని, కలెక్టర్, అటవీ, రెవెన్యూ అధికారులు ఉన్నారు. భూములకు సంబంధించిన వివరాలను అధికారులు పవన్‌కు వివరించారు. భూములను పరిశీలించిన అనంతరం డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడారు. 'సరస్వతీ పవర్ ప్లాంట్ కోసం గత ముఖ్యమంత్రి, వైకాపా అధినేత సొంతంగా భూములు తీసుకున్నారు. 2009లో వైఎస్ఆర్ సీఎంగా ఉన్నప్పుడు 30 ఏళ్లు లీజుకు తీసుకోగా.. జగన్ సీఎం అయిన తర్వాత లీజును మరో 50 ఏళ్లు పొడిగించుకున్నారు. కానీ, ఆ రోజునుంచి ఇవాల్టి వరకు ప్రాజెక్టు కార్యరూపం దాల్చలేదు. తమ కుటుంబాలకు ఉపాధి దొరుకుతుందనుకున్న రైతుల ఆశలు తీరలేదు' అని వ్యాఖ్యానించారు. 'గతంలో నాటు బాంబులు వేసి భయపెట్టారు. ఇష్టం లేకున్నా భూములు అమ్మాల్సిన పరిస్థితి తీసుకొచ్చారు. కోడెల శివప్రసాదును వేధించి చంపేశారు. ఫర్నీచరుపై శివప్రసాదును వేధించిన వ్యక్తి.. ప్లాంట్ పేరుతో భూములు లాక్కొన్నారు. ఉద్యోగాలు ఇస్తాం.. భూములు అమ్మేయండని బలవంతంగా తీసుకున్నారు. మరోచోట 350 ఎకరాలను తీసుకున్నారు. ముడి సరకు కోసం 1100 ఎకరాలు తీసుకున్నారు. ఇక్కడి ప్రజల భూమిని తీసుకొని.. వారినే ఇబ్బందులకు గురి చేశారు' అని ఉప ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. '400 ఎకరాల అటవీ భూములను రెవెన్యూ భూములుగా మార్చేసి లాక్కున్నారని స్థానికులు చెబుతున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరుపుతాం. సరస్వతి పవర్ కింద ఎంత భూమి ఉంది. ఇందులో ఎలాంటి అవకతవకలు జరిగాయనే దానిపై విచారణ చేయాలని కలెక్టర్‌ను ఆదేశిస్తున్నా. పెట్టిన ప్రాజెక్టు అసలు ఎందుకు ముందుకెళ్లలేదో తేల్చాలి. కొండలు, చెరువులు.. ఇలా సహజ వనరులున్న మరో 24 ఎకరాలు ఆక్రమించుకున్నారు. భూములిచ్చిన రైతులకు అండగా ఉంటామని భరోసా ఇస్తున్నాం' అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# గెలుపే మన కర్తవ్యం!

## ఎమ్మెల్సీ ఎన్నికలపై అశోక్‌బాబు పిలుపు - ఓటు నమోదు గడువు పెంచాలని విజ్ఞప్తి



అమరావతి (చైతన్య రథం): సర్వర్ సమస్య కారణంగా ఓటర్ల నమోదు మందగించిన నేపథ్యంలో.. గ్రాడ్యుయేషన్ ఓటర్ల నమోదు సమయం పెంచాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌ను తెలుగుదేశం పార్టీ కోరుతున్నట్టు ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు వెల్లడించారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు మాట్లాడుతూ... గతంలో ప్రతిపక్షంలో ఉండి గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయఢంకా మోగించామని, ఈసారి అదే పరిస్థితి కొనసాగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. టీడీపీ అభ్యర్థులను గెలిపించి ప్రజల్లో నమ్మకం పెంచాలని విజ్ఞప్తి చేస్తూ.. గుంటూరు, కృష్ణా ఈస్ట్, వెస్ట్ జిల్లాల పట్టభద్రుల ఎన్నికల ఓటర్ల నమోదు కావడానికి ఎలక్షన్ కమిషన్ ఇచ్చిన సమయం ముగుస్తోందని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఈ రెండు జిల్లాలతోపాటు అటు విశాఖపట్నంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ మరియు తూర్పు గోదావరి జిల్లాలో ఎమ్మెల్సీ అభ్యర్థి సీటు కూడా ఖాళీ ఉంది. విజయవాడలో జరిగిన వరదల కారణంగా కూడా ఎమ్మెల్సీ ఎన్నికకు అభ్యర్థుల ఓటు నమోదు కార్యక్రమం ఆలస్యమైంది. గత సెప్టెంబరు 30నే నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించాల్సి ఉండగా కొన్ని టెక్నికల్ సమస్యల కారణంగా మూడు రోజులు ఆలస్యంగా ప్రారంభించడం జరిగింది. నేడు కూడా సర్వర్ సమస్య వచ్చింది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదుకు గడువు తేదీని పెంచాలని అశోక్‌బాబు కోరారు. గతంలో తూర్పు రాయలసీమ, వెస్ట్ రాయలసీమలలో నాడు అపోజిషన్‌లో ఉన్నా ఆశాదీపంలాగ పోటీ చేసి టీడీపీ అభ్యర్థులు గెలిచామని గుర్తు చేశారు. అధికారులు కేంద్ర ఎన్నికల కమిషన్ ఇచ్చిన గైడ్‌లైన్స్‌ను తూ.చ తప్పక పాటించాలని అశోక్‌బాబు కోరారు. కూటమి బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకుంటేనే కౌన్సిల్ ప్రక్షాళన సాధ్యమవుతుందని, కౌన్సిల్ పోరాటంతోనే మూడు రాజధానుల బిల్లు వీగిపోయిన విషయం అందరూ గ్రహించాలని అశోక్‌బాబు అన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు దారుణంగా వ్యవహరించిందని గుర్తు చేస్తూ.. టీడీపీ, కూటమి నాయకులు, కార్యకర్తలు జాగ్రత్తగా మసులు కోవాలని పిలుపునిచ్చారు. ఈ రెండు నియోజకవర్గాల్లో టీడీపీ కూటమి అభ్యర్థులు బలపరచిన అభ్యర్థులైన టీడీపీ మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పేరాబత్తుల రాజశేఖర్‌లను గెలిపించుకోవాల్సిన అవసరాన్ని అశోక్‌బాబు గుర్తు చేశారు.



# పోలీసు వ్యవస్థ పటిష్టం

- సాంకేతికంగా బలోపేతం చేస్తాం
- వైసీపీ అరాచకాలను సరిదిద్దుతున్నాం
- జగన్ సూక్తులు గురివింద చందమే
- డిఎస్పీల పాసింగ్ ఔట్ పరేడ్‌లో హోంమంత్రి

అనంతపురం (చైతన్య రథం): వైకాపా హయాంలో జరిగిన అరాచకాలను సరిదిద్దడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. వైకాపా సైకో బ్యాచ్ అసత్యాలను ప్రచారం చేస్తూ ప్రజలను భయపెడుతుంటే.. జగన్ సూక్తులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. అనంతపురం పోలీస్ శిక్షణ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన డీఎస్పీల పాసింగ్ ఔట్ పరేడ్‌కు అనిత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పోలీసుల సంక్షేమంతోపాటు వారికి మౌలిక సదుపాయాల కల్పన దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులను సమాయత్తం చేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ఏమీ జరగకపోయినా.. ఏదేదో జరిగిపోయిందని దుష్ప్రచారం చేస్తూ ప్రజలను వైకాపా సైకోలు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు.

"గత ప్రభుత్వ హయాంలో జగన్ ఇంటి భద్రత కోసం రూ.12 కోట్లు ఖర్చు చేశారు. వైకాపా ఐదేళ్ల పాలనలో పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులకు వైకాపా దుష్టపాలన పాపాలే కారణం. శాంతిభద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. పోలీసు వ్యవస్థను పటిష్టం చేస్తాం. పోలీసులకు మౌలిక సదుపాయాలను కల్పించి, సాంకేతికంగా పోలీసు వ్యవస్థను బలోపేతం చేస్తాం" అని అనిత స్పష్టం చేశారు.

# గడువు పొడిగించాలి

- ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ
- 18 వరకు పొడిగించాలని ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి



అమరావతి (చైతన్య రథం): గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి, ఉభయ గోదావరి పట్టభద్రుల నియోజకవర్గానికి ఫిబ్రవరి నెలాఖరులోగానీ, మార్చి మొదటి వారంలోగానీ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో.. ఓటు నమోదు కార్యక్రమాన్ని పొడిగించాలని మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ ఎన్నికల కమిషన్‌ను విజ్ఞప్తి చేశారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేఖరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ మాట్లాడుతూ... సర్వర్లు పనిచేయక పోవడం వల్ల ఓటు నమోదు చురుగ్గా సాగడం లేదంటూ.. దీనికి ఓటర్లు బాధ్యత వహించలేరన్నారు. కంప్యూటర్ ముందు కూర్చొని ఓటు నమోదు చేసుకోవాలనుకున్నా కుదరని పరిస్థితి ఉన్న నేపథ్యంలో.. ఓటరు నమోదు గడువుతేదీ పెంచాలని డిమాండ్ చేశారు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 2 లక్షల 26వేల 144, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో లక్షా 44 వేలు ఓట్లే నమోదయ్యాయన్నారు.

తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విస్తృత ప్రజానీకానికి పిలుపునిస్తూ.. గడువు ముగుస్తున్న నేపథ్యంలో పట్టభద్రులంతా బుధవారం సాయంత్రంలోపు ఓటును నమోదు చేసుకోవాలన్నారు. ఒక్కో సెగ్మెంట్‌లో 4 లక్షలు టార్గెట్ రీచ్ కావాలంటూ.. కూటమి నేతలు కసి, పట్టుదలతో నాయకుడి ఆదేశాలను తప్పక పాటించాలని రామకృష్ణ కోరారు. ఇది మంచి ప్రభుత్వం కనుక.. మనం గెలిస్తే నాయకుల్లో, ప్రజల్లో ఒక నమ్మకం ఏర్పడుతుందన్నారు. కూటమి ప్రభుత్వానికి చాలా పాజిటివ్ రెస్పాన్స్ వస్తోందని, సమస్యలేవైనా ఉంటే నాయకుల దృష్టికి తెస్తే కచ్చితంగా పరిష్కరిస్తారన్నారు. టీడీపీ కూటమి ప్రజల ప్రభుత్వంగా పనిచేస్తుందని మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ కితాబునిచ్చారు.

రెండు నియోజకవర్గాల్లో టీడీపీ కూటమి బలపరచిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పేరాబత్తుల రాజశేఖర్‌లు గెలిచి తీరాలని పిలుపునిచ్చారు. గత మార్చిలో జరిగిన మూడుచోట్ల టీడీపీ అభ్యర్థుల్ని భారీ మెజార్టీతో గెలిపించుకన్నామని, ఆ గెలుపే 2024 మేలో జరిగిన ఎన్నికల్లో కూటమి విజయానికి నాంది ప్రస్తావన పలికిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల కాలంలోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని, చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వ సమర్థతను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కూటమి పార్టీల శ్రేణులకు విజ్ఞప్తి చేశారు.

2014-15 మధ్యకాలంలో పదవ పీఆర్సీ ప్రకారం 43శాతం ఫిట్‌మెంట్ ఇచ్చాం, కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ ఇచ్చాం, ఎయిడెడ్ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న వారికి 48 ఏళ్లలో మొట్టమొదటిసారిగా 1నే జీతాలిచ్చాం, మున్సిపల్ స్కూళ్లలో పనిచేస్తున్న హైస్కూల్ హెడ్మాస్టర్‌లకు గెజిటెడ్ హెూదా కల్పించాం, 506, 507 జీవోల ద్వారా మొదటిసారిగా భార్య, భర్తలను ఒకచోటికి తీసుకురావడానికి జీవోలు తెచ్చాం, సీపీఎస్ ఉద్యోగులకు గ్రాడ్యుటీ అండ్ ఫ్యామిలీ పెన్షన్ స్కీమ్ ద్వారా చనిపోయిన టీచర్ భార్యగానీ భర్తగానీ ఉంటే వారికి రూ.45 వేల వరకు మెరుగైన పెన్షన్ కల్పించాం.. తెలుగుదేశం ప్రభుత్వం సాధించిన అన్ని విజయాలను ప్రచారం చేయాలని రామకృష్ణ కోరారు. ఉద్యోగస్థులు, టీచర్ల, వివిధవర్గాల ప్రజల అభివృద్ధికి గత టీడీపీ ప్రభుత్వం పనిచేసిందని, 2019నుంచి 2024 వరకు వైసీపీ పరిపాలనలో అన్ని వర్గాల ప్రజలు మోసపోయా రని రామకృష్ణ అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వంగా పని చేస్తోందని, ఐదేళ్లలో రాష్ట్రం అభివృద్ధి సాధించడం ఖాయమని రామకృష్ణ వ్యాఖ్యానించారు.

# వైసీపీ ఎంపీ గ్యాంగ్ అరాచకం

- కార్ల యజమానిని బంధించి చిత్రహింసలు
- బుగ్గన బంధువుకు భూమిని కట్టబెట్టిన వైనం
- బాకీ అడుగుతుంటే ప్రాణాలు తీస్తామంటున్నారు
- పని కల్పిస్తానని విదేశాలకు తీసుకెళ్లి చిత్రహింసలు
- న్యాయం చేయాలంటూ మొరపెట్టుకున్న బాధితులు
- టీడీపీ సెంట్రల్ ఆఫీస్‌లో గ్రీవెన్స్ నిర్వహణ

అమరావతి (చైతన్య రథం): కార్లు అద్దెకు తీసుకుని మోసగించిన వ్యక్తిపై కేసు పెడితే.. తనకు న్యాయం చేయాల్సిన వేంపల్లి ఎస్ఐ తిరుమల నాయుడు తనను వైసీపీ దుర్మార్గులకు అప్పగించారని తెలంగాణ సంగారెడ్డికి చెందిన టీ సతీష్‌కుమార్ మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడు. వైసీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి అనుచరులు శంకర్‌రెడ్డి, ప్రసాద్, వైసీపీ జడ్పీటీసీ రవికుమార్‌లు ఇడుపులపాయలోని రిసార్ట్‌లో బంధించి ఐదురోజులు చిత్రహింసలు పెట్టారని.. తప్పించుకుని బయటపడినట్టు ఫిర్యాదులో పేర్కొన్నాడు. రెండు నెలల క్రితం తన కార్లు అవినాష్‌రెడ్డి కాన్వాయ్‌లో చూశానని, ఏపీ పోలీసులు తనకు న్యాయం చేయాలని కన్నీటి పర్యంతమయ్యాడు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్లరామయ్య, మాజీ శాసనమండలి ఛైర్మన్ షరీఫ్, బుచ్చిరాంప్రసాద్‌లు అర్జీని స్వీకరించి.. న్యాయం చేస్తామని బాధితుడికి హామీ ఇచ్చారు. కడప జిల్లా ఎస్పీతో మాట్లాడి.. వివరాలు తెలుసుకున్న నేతలు.. బాధితుడికి కార్లు ఇప్పించి, నిందితులపై కేసులుపెట్టాలని, తప్పుడు పనులకు సహకరించిన పోలీసులను సస్పెండ్ చేయాలని ఆదేశించారు.

గంజాయికి అలవాటుపడిన ఓ వ్యక్తి తనపట్ల, తమ కుమార్తెపట్ల నీచంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడంటూ విజయవాడ రాజరాజేశ్వరిపేటకు చెందిన మహిళ అర్జీని సమర్పించింది. తన కుమార్తెపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న వ్యక్తిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే.. స్థానిక పోలీసులు పట్టించుకోక పోగా.. తనపట్ల నీచంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేసింది. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లడం తెలుసుకున్న తాగుబోతు వ్యక్తి అతని అమ్మతో కలిసి దాడి చేశారని, నిత్యం వేధింపులకు గురిచేస్తూ అత్యాచార యత్నానికి ఒడిగట్టాడని కన్నీటి పర్యంతమైంది. గంజాయి వ్యక్తినుంచి తన కుటుంబానికి రక్షణ కల్పించి.. మహిళలపట్ల దిగజారి ప్రవర్తించిన పోలీసులపై చర్య తీసుకోవాలని బాధిత మహిళ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసింది.

తమ భూమిని అప్పటి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బంధువు బీఆర్సీ బుగ్గారెడ్డికి అక్రమంగా రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ చేశారని.. దీనిపై ప్రశ్నిస్తే పోలీసులతో బెదిరించారని.. నంద్యాల జిల్లా పాణ్యం మండలం గోరుకల్లు గ్రామానికి చెందిన సురేష్ బాబు నేతలకు ఫిర్యాదు చేశాడు. అక్రమంగా ఆన్‌లైన్ చేసిన 14 సెంట్ల భూమిని ఇప్పించాలని, అక్రమాలకు సహకరించిన అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

తీసుకున్న అప్పు తిరిగి చెల్లించకపోవడమే కాకుండా.. బాకీ అడుగుతుంటే కుటుంబాన్ని చంపేస్తానని చింతలచెరువు వెంకటేశ్వర రెడ్డి బెదిరిస్తున్నాడంటూ విజయవాడకు చెందిన యక్కంటి కృష్ణారెడ్డి నేతల ముందు వాపోయాడు. సాయం అడిగాడని ఇంటి కాగితాలు తాకట్టుపెట్టి రూ.32 లక్షలు ఇచ్చానని, డబ్బు తీసుకున్న వ్యక్తే బెదిరిస్తున్నాడంటూ వాపోయారు.

పని చూపిస్తానని భార్యను మస్కట్ తీసుకెళ్లిన ఏజెంట్, కనీసం ఆమెకు తిండికూడా పెట్టకుండా వేధిస్తున్నాడని, తన భార్యను ఇండియాకు తిరిగి పంపించమని అడిగితే డబ్బులు డిమాండ్ చేస్తున్నాడంటూ ఏజెంట్ మల్లిడి సుబ్రహ్మణ్యంపై పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన టీ రాజశేఖర్ విన్నవించుకొన్నాడు. స్థానిక పోలీస్



స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని.. తల్లికోసం పిల్లలు బెంగ పెట్టుకున్నారంటూ బావురుమన్నాడు. మస్కట్‌లో తన భార్య ఆరోగ్య పరిస్థితి క్షీణించిందని.. సాయం చేసి ఎలాగైనా ఆమెను ఇండియాకు రప్పించాలంటూ అర్జీలో వేడుకున్నాడు.

తన పొలాన్ని వైసీపీ నేతల కబ్జా చేశారని, న్యాయం కోసం పోలీసులను ఆశ్రయిస్తే.. తనపైనే దాడులకు దిగుతున్నారంటూ కృష్ణా జిల్లా జి కొండూరుకు చెందిన మేరెడ్డి సామ్రాజ్యం అనే మహిళ నేతలకు ఫిర్యాదు చేశారు. విచారించి తనకు న్యాయం చేయాలని కోరారు.

కేంద్ర మాజీ ఉద్యోగులు తమ ఆరోగ్య సమస్యలపై ఆసుపత్రులకు వెళ్లాలంటే నెల్లూరులోని సీజీఎస్‌హెచ్‌కు వెళ్లవలసి వస్తోందని.. దూరాభారంతో వృద్ధాప్యంలో ఇబ్బందులు పడుతున్నామంటూ.. కర్నూలులో మరో ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని టీడీపీ రాష్ట్ర క్రిస్టియన్ సెల్ వైస్ ప్రెసిడెంట్ ఎవైన్‌బాబు రాజ్ నేతలను కోరారు.

ప్రకాశం జిల్లా చిన్నగుడిపాడుకు చెందిన రమణబాబు అనే వ్యక్తి నేతలకు అర్జీ ఇస్తూ.. నాలుగు తరాలుగా పూర్వీకులనుంచీ అనుభవంలో ఉన్న భూమిని... ప్రభుత్వం వేరొకరికి కేటాయించిందని.. అందుకు వైసీపీ నేతలు దారుణానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. తిరిగి తనకు భూమిపై హక్కులు కల్పించాలని విన్నవించుకున్నాడు.

పలువురు సీఎంఆర్ఎఫ్ సాయం కోసం అర్జీలు తీసుకురాగా.. మరికొందరు నామినేటెడ్ పదవులు ఆశిస్తూ.. నేతలు అర్జీలు ఇచ్చారు. వివిధ సమస్యలపై తమకు న్యాయం చేయాలంటూ పలువురు నేతలను వేడుకున్నారు.



















# పర్యాటకంపై దృష్టి పెట్టండి



### అధికారులకు ఇన్‌చార్జి మంత్రి కొలుసు ఆదేశం - బాపట్ల డీఆర్సీలో అభివృద్ధిపై విస్తృత చర్చ



బాపట్ల (చైతన్యరథం): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసినప్పుడే అభివృద్ధి పట్టాలపై బాపట్ల పయనిస్తుందని జిల్లా ఇన్చార్జ్ మంత్రి, రాష్ట్ర గృహ నిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి సూచించారు. జిల్లా అభివృద్ధి సమీక్షా కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. సమావేశంలో జిల్లా అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం డిఆర్‌సి సమావేశంలో చర్చించిన అంశాలను మంత్రి పార్థసారథి మీడియాకు వెల్లడించారు.

స్వర్ణాంధ్ర దిశగా రాష్ట్రం పయనిస్తోందని, దేశంలోనే మొదటి రెండుస్థానాల్లో రాష్ట్రం ఉండేలా ముఖ్యమంత్రి చంద్రబాబు విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. సీఎం ఆశయాలు, ఆలోచనలకు తగినట్టుగా మనం పనిచేస్తే బాపట్ల అభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు. బాపట్ల జిల్లాకు 95 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉందని, పర్యాటకంగా వివిధ ప్రాజెక్టులతో అభివృద్ధి చేయగలిగితే అన్ని రంగాలలో రాణించగలమన్నారు. సూర్యలంక బీచ్ పర్యాటక కేంద్రంగా మారనుందన్నారు. బీచ్ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించి నివేదిస్తే తక్షణమే అమలులోకి తెస్తామన్నారు. ముఖ్యంగా సర్వీస్ సెక్టార్‌లోనే యువతకు అత్యధికంగా ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. జలవనరులు అందుబాటులో ఉన్న బాపట్లలో పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ నూతన విధానాలు తోడైతే పారిశ్రామిక రంగం అభివృద్ధి జరుగుతుందన్నారు. బాపట్ల జిల్లాలోని ఆయా శాఖలలో ఖాళీగావున్న ఉద్యోగాల భర్తీకి కృషి చేస్తామన్నారు. జిల్లా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

జాబ్ కార్డులు ఇచ్చిన వారందరికీ ఉపాధి హామీ పథకం కింద వంద రోజులు పని దినాలు కల్పించాలని మంత్రి పార్థసారథి ఆదేశించారు. 2.64 లక్షలమంది కూలీలు, ఉపాధి పనులు చేపట్టడానికి అనేక అవకాశాలు ఉన్నప్పటికీ పనులు చేయకపోవడం ఏమిటని అధికారులను నిలదీశారు. ఉపాధి హామీ పథకాన్ని అభివృద్ధి పనులకు అనుసంధానించాలని ఆయన సూచించారు. చెరువుల తవ్వకం, రహదారులు, భవనాలు నిర్మించడంతోపాటు ఉద్యాన పంటలు నాటడంవంటి పనులు చేపట్టాలన్నారు. బాపట్లలో ఉద్యాన పంటలకు అధిక ప్రాధాన్యత నివ్వాలన్నారు. అక్రమాలు జరిగినచోట సమగ్ర విచారణతో చర్యలు తీసుకోవాలన్నారు.

ఎన్టీఆర్ హౌసింగ్ కింద గతంలో నిర్మించిన ఇళ్లకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని చెబుతూనే.. బాపట్ల జిల్లాలో 50 వేల ఇళ్లు మంజూరైతే.. 16,362 మాత్రమే పూర్తయ్యాయన్నారు. 12,014 నిర్మాణాలు ఇంకా మొదలు కాలేదని, పునాదిస్థాయిలో 10,504 ఇళ్ళుంటే.. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. గృహ నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణాలలో ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానించి ముందుకు తీసుకువెళ్లాలన్నారు.

ధాన్యం సేకరణకు అధికారులు సిద్ధం కావాలన్నారు. మిల్లులు గుర్తింపు, గోతాముల కొనుగోలు, టెండర్ల ప్రక్రియ, తేమ యంత్రాల కొనుగోలు తక్షణమే పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. జిల్లాలోని 57 మిల్లుల్లో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ధాన్యం కొనుగోలు వాహనాలలో తరలింపులు పారదర్శకంగా ఉండాలని, 48 గంటలలోనే ధాన్యం కొనుగోలు సొమ్ము రైతులకు చెల్లించాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను సిద్ధంగా ఉంచిందన్నారు.

పంటకాల్వల ఆధునీకరణ పనులు జిల్లాలో వేగంగా చేపట్టాలని విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. పంట కాలువలలో నీటి ప్రవాహంపై అధికారులు పర్యవేక్షణ ఉండాలని సూచించారు. కాల్వల లాకుల వద్ద లస్కర్లను తక్షణమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. నీటి విడుదల సమయంలోనే కాల్వల మరమ్మతు పనులు ఎలా చేస్తారని అధికారులను ప్రశ్నిస్తూ.. కాల్వల నిర్వహణ, పర్యవేక్షణ లోపంతోనే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా కొన్ని కాల్వలలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో నీటిని నిలిపి వేగంగా పనులు చేసి నీటిని విడుదల చేయాలన్నారు. భావనాసి రిజర్వాయర్‌కు నీరందించే ప్రక్రియ వేగంగా చేపట్టాలన్నారు. కొరిశపాడు ఎత్తిపోతల పథకం పనులు నిలిచిపోవడంపై ఆరా తీస్తూ.. గుత్తేదారు మెగా సంస్థతో పనులు త్వరగా పూర్తి చేయించాలన్నారు. రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు బాపట్ల జిల్లాకు 200 ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చాయని, రెండు నెలలలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పూర్తి చేయాలన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్లలో నకిలీ ధ్రువీకరణ పత్రాలుంటే విచారించి తొలగించాలని సమావేశంలో పాల్గొన్న మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ అందించే బాధ్యత అధికారులదేనన్నారు. జల వనరుల శాఖ అధికారులు క్షేత్ర పరిశీలన లేకపోవడంతోనే చివరి భూములకు సాగునీరు అందడం లేదన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపమే సాగునీటి సమస్యలు వస్తున్నాయన్నారు. తదుపరి సమావేశంలో సమగ్ర వివరాలతో హాజరుకావాలని ఆదేశించారు.

స్వర్ణాంధ్ర-2047 విజన్ లక్ష్యంతో బాపట్ల యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. వ్యవసాయ రంగం ద్వారా రానున్న ఐదేళ్లలో రూ.38 వేల 165 కోట్లు ఆదాయం లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. పారిశ్రామిక రంగంలో రూ.13,862 కోట్లు ఆదాయం సాధించాలని లక్ష్యం కాగా, సేవారంగంలో రూ.23,033 కోట్లు ఆదాయం లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.

గుంటూరు ఛానల్ విస్తరణ పనులు వేగంగా చేపట్టాలని ఎమ్మెల్యే కె లక్ష్మణరావు కోరారు. గుంటూరు ఛానల్ విస్తరణ జరిగితే 25 వేల ఎకరాలు సాగులోకి వస్తాయన్నారు. ఇందుకోసం రూ.143 కోట్ల నిధులు విడుదలైనప్పటికీ పనులు జరగకపోవడంపై ఆరా తీశారు. వైద్య కళాశాల నిర్మాణం త్వరగా పూర్తిచేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా చూడాలన్నారు. నిషేధిత భూముల జాబితానుంచి పట్టా భూములను తొలగించాలని ఎమ్మెల్యే టి మాధవరావు కోరారు. డిఆర్‌సి సమావేశంలో అంశాలను అజెండాలో చేర్చాలని కోరారు. అలాగే ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను తక్షణమే భారతి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

లస్కర్ల నియామకం వేగంగా చేపట్టి సమస్యల పరిష్కరించాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మంత్రిని కోరారు. ఉచిత ఇసుక విధానం ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఇసుక సమస్యలు పరిష్కరించాలన్నారు. ఉచిత ఇసుక విధానం సక్రమంగా అమలు కావడం లేదని చీరాల ఎమ్మెల్యే ఎం మాలకొండయ్య మంత్రి దృష్టికి తెచ్చారు. చీరాల పర్చూరు నియోజకవర్గంలో ఇష్టం వచ్చినట్లు క్షేత్రస్థాయిలో ఇసుక కొందరు అక్రమంగా తవ్వుకొని వెళ్తున్నారని చెప్పారు. అక్రమ తవ్వకాలను అరికట్టాలన్నారు. ఇసుక తవ్వకాలకు ఏ ప్రాంతంలో అనుమతులు ఇచ్చారో స్పష్టంగా తెలపాలని కోరారు. సమావేశంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, జిల్లా సంయుక్త కలెక్టర్ జైన్, జిల్లా రెవిన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



# బాపట్ల అభివృద్ధికి కృషిచేస్తా

### - జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు హామీ



బాపట్ల, (చైతన్య రథం): బాపట్ల జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ఇన్చార్జి మంత్రి, గృహ నిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి హామీ ఇచ్చారు. మంగళవారం జిల్లాకు తొలిసారిగా రావడంతో మంత్రికి ఘన స్వాగతం లభించింది. పీవీ పాలెం యాజలి వద్ద గుంతల రహిత కార్యక్రమానికి జిల్లా ఇన్చార్జి మంత్రి పార్థసారథి, విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ జె వెంకటమురళి కలిసి భూమి పూజ చేశారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులతో కలిసి టీ సేవించి.. సాదక బాదకాలు అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న వైద్యం, పనిముట్ల వివరాలపై ఆరా తీశారు. వేతనాల చెల్లింపులు, కుటుంబ పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాపట్ల జిల్లాలోని 2,200 మంది పారిశుద్ధ్య కార్మికులకు పనిముట్లు, ప్రాథమిక వైద్య కిట్లు ఇవ్వడానికి రూ.46 లక్షల నిధులు అవసరమని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

స్పందించిన మంత్రి పార్థసారథి జిల్లా జనరల్ ఫండ్ నుంచి నిధులను విడుదల చేయాలంటూ కలెక్టర్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రి కొలుసు మాట్లాడుతూ.. జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి అవకాశాలు ఉన్నాయని, జిల్లా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. సాగు భూముల అభివృద్ధికి కృషి చేస్తామని, పర్యాటకానికి అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు.

ప్రజల ప్రయాణ సౌకర్యం కోసం రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, సీఎం ఆదేశాల మేరకు త్వరతగతిన పనులు పూర్తి చేయాలని కార్యక్రమానికి హాజరైన విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.826 కోట్ల నిధులు కేటాయించిందన్నారు. నెల రోజుల్లో ప్రయాణికులకు ఇబ్బందిలేని రోడ్లను అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. సూపర్ సిక్స్ హామీలలో భాగంగా దీపం పథకం-2ని ప్రారంభించామని, ఒకదాని వెంట మరొకటి హామీలన్నీ అమలు చేస్తామన్నారు. బాపట్ల జిల్లాలో వ్యవసాయం, ఆక్వా రంగాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. బాపట్ల నియోజకవర్గంలో రూ.3.24 కోట్ల నిధులతో పనులు జరుగుతున్నట్లు కలెక్టర్ జె వెంకట మురళి వెల్లడించారు. యాజిలీ -ఖాజీపాలెం రహదారిని రూ.39 లక్షలతో మరమ్మతులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో చీరాల శాసనసభ్యులు ఎం మాలకొండయ్య, ఆర్ అండ్ బి ఈఈ గీతారాణి, డిపిఓ ప్రభాకర్, ఆర్డీవో పి గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ జిల్లా అభివృద్ధిపై ఎంపీ కేశినేని శివనాథ్ సమీక్ష

**◆విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టిసారించామని వెల్లడి**




విజయవాడ (చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లా అభివృద్ధిపై ఎంపీ కేశినేని శివనాథ్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. మంగళవారం సమీక్షలో అనేక అంశాలపై చర్చించామని.. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అన్ని పీహెచ్.సి సెంటర్లో అవసరమైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయపరంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులను ప్రోత్సహిస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. డ్రోన్లను ఉపయోగించి వ్యవసాయ పద్ధతులు అవలంబించేలా శిక్షణ ఇస్తామని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన చెప్పారు. మంగళవారం ఎన్టీఆర్ జిల్లా అభివృద్ధిపై ఎంపీ కేశినేని అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఈరోజు సమీక్షలో అనేక అంశాలపై చర్చించామని.. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. అన్ని పీహెచ్.సి సెంటర్లో అవసరమైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని పీహెచ్‌సీ సెంటర్లను పూర్తిగా ఆధునీకరిస్తామని వెల్లడించారు. దీనిపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్‌తో కూడా ఇప్పటికే మాట్లాడి నిధుల అంశాలను కూడా ప్రస్తావించామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కూడా కలిసి అన్నీ వివరిస్తామన్నారు. కూటమి ప్రభుత్వంలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చూస్తామని స్పష్టం చేశారు. అంగన్వాడీ కేంద్రాలు అనేకం అద్దె భవనాలు ఉన్నాయని.. వాటికి సొంతభవనాలు అవసరం ఉందన్నారు. మారుమూల గ్రామాల్లో కూడా తాగునీటి అవసరాలు తీర్చే విధంగా ప్రత్యక్ష చర్యలు చేపడతామన్నారు. ప్రతి పాఠశాలలో మెరుగైన విద్యను అందిస్తామన్నారు. ప్రతి స్కూల్లో ఆట స్థలం ఉండాలని భావిస్తున్నామని.. దానికి తగ్గట్టు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో స్వచ్ఛ్ భారత్‌లో భాగంగా 20 వేల టాయిలెట్స్ నిర్మాణంతో పాటు రాబోయే మార్చి, ఏప్రిల్ నాటికి ఈ టాయిలెట్స్ నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే అంశం చర్చించటం జరిగిందని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో వో.ఎస్.డి ఎ.వెంకటరత్నం, దిశ కమిటీ సభ్యులు, సీపీవో వై.శ్రీలత, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, డ్వామా పీడీ ఎ.రాము, ఐసీడీఎస్ పీడీ జె.ఉమాదేవి, డీఈవో యూవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్స్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ వేడుకల్లో మంత్రి మండిపల్లి

**◆దేశంలోనే అత్యుత్తమ క్రీడా విధానాన్ని రూపొందించామని వెల్లడి**



విజయవాడ (చైతన్యరథం): దేశంలోనే అత్యుత్తమ క్రీడా విధానాన్ని రూపొందించామని క్రీడా సంఘాల తోడ్పాటుతో ఇటువంటి మరిన్ని క్రీడా పోటీలు నిర్వహణ జరగడం పట్ల రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇండోర్ స్టేడియాలు నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని అమరావతిలో దేశంలోని అత్యుత్తమ స్పోర్ట్స్ హబ్ నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందడుగు వేస్తున్నారని చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న కాస వద్దమూడి మోహనకృష్ణ మెమోరియల్ ఏపీ స్టేట్ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ అండర్ -13 క్రీడల పోటీల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మోహనకృష్ణ చిత్రపటానికి మంత్రి నివాళులర్పించారు. నిర్వాహకులు మంత్రిని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ని ఘనంగా సన్మానించారు. క్రీడాకారులకు కూటమి ప్రభుత్వ హయాంలో అన్ని విధాలా తోడ్పాటు అందిస్తామని తెలిపారు. అనంతరం విజయవాడ ఈస్ట్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మంత్రి రాంప్రసాద్ బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారుల్ని ఉత్సాహపరిచారు.



## ప్రతిష్టాత్మకంగా స్పోర్ట్స్ పాలసీ రూపకల్పన

**◆క్రీడల పట్ల చిత్తశుద్ధిని నిరూపించిన సీఎం నారా చంద్రబాబునాయుడు**

**◆సమర్థవంతగా పాలసీని అమలు చేస్తాం**

**◆ శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు**

అమరావతి: (చైతన్యరథం): దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా స్పోర్ట్స్ పాలసీని రూపొందించామని, స్పోర్ట్స్ పాలసీలను ఆమోదించి క్రీడల పట్ల తనకున్న చిత్తశుద్ధిని సీఎం నారా చంద్రబాబునాయుడు నిరూపించుకున్నారని ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ(శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యదర్శి(యూత్ సర్వీసెస్ అండ్ స్పోర్ట్స్, టూరిజం అండ్ కల్చరల్) వాడరేవు వినయ్ చంద్‌ని శాప్ ఛైర్మన్ వెలగపూడిలోని సచివాలయంలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు స్పోర్ట్స్ పాలసీపై చర్చించారు. రాష్ట్రాన్ని క్రీడా కేంద్రంగా మార్చేందుకు సీఎం చంద్రబాబునాయుడు నాలుగు లక్ష్యాలతో రూపొందించిన స్పోర్ట్స్ పాలసీ నిర్వహణపై సమీక్షించారు. సీఎం ఆలోచనలకు అనుగుణంగా నూతన క్రీడావిధానాలను సమర్థంగా నిర్వహించేందుకు అన్ని క్రీడా సంఘాలు, ఫెడరేషన్లను సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలన్నారు. ఇందుకు సంబంధించి శాఖాపరంగాచేపట్టాల్సిన లక్ష్యాలు, నిర్వర్తించాల్సిన విధానాలపై చర్చించారు.

## శాంతిభద్రతలపై కట్టుకథలతో జగన్, వైసీపీ తప్పుడు ప్రచారం

**◆ రాష్ట్రాన్ని ఓపెన్ జైలుగా మార్చి నిరంకుశ పాలన సాగించిన నియంత జగన్: జీవీఆంజనేయులు**



వినుకొండ (చైతన్యరథం): రాష్ట్రంలో శాంతిభద్రతలపై కావాలనే కట్టుకథలతో జగన్, వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ సీనియర్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర్నుంచి ఇదే పనిగా పెట్టుకుని మరీ దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజానికి అయిదేళ్ల అరాచకాలరెడ్డి రక్తపుమడుగులో కూరుకుపోయిన జగన్మోహన్ ధర్మపన్నాలు చెప్పడం మానుకోవాలని హితవు పలికారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు సంబంధించి పదేపదే జగన్, వైసీపీ, సాక్షి అడ్డగోలుగా అబద్ధాలు వండి వార్చుతున్నారంటూ మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో దుయ్యబట్టారు. ఇదే జగన్మోహన్ రెడ్డి వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజాస్వామ్య హక్కుల్ని ఎలా ఖూనీ చేశారో మరిచిపోయారా అని ప్రశ్నించారు. వైసీపీ ఇసుక అక్రమాలపై ప్రశ్నిస్తే పోలీస్ స్టేషన్‌లలోనే శిరోముండనాలు, మాస్క్ అడిగిన పాపానికి కర్కశంగా రెక్కలు విరిచికట్టడం, లాకప్‌ల్లో పెట్టి కొట్టి చంపడం.. ఇవన్నీ ఎవరు చేశారని నిలదీశారు. సోషల్ మీడియాలో, ఆన్‌లైన్‌లో విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్న వాళ్లను ఏం చేయాలో చెప్పాలన్నారు. రౌడీలను, తప్పుడు ప్రచారాలు చేస్తున్నా వారిని అరెస్టు చేస్తే ప్రజాస్వామ్యం గగ్గోలు అంటూ పెడుతున్నారని, ఇదే వైకాపా ప్రభుత్వంలో జీవో-1 తో ప్రజాస్వామ్యాన్ని హత్య చేయాలని కుట్ర పన్నింది గుర్తు లేదా అని చురకలు వేశారు. రాజ్యాంగం, ప్రజా స్వామ్యం అన్నమాటకే అర్థం లేకుండా 5ఏళ్లపాటు రాష్ట్రాన్ని ఓపెన్ జైలుగా మార్చి నిరంకుశ పాలన సాగించిన నియంత జగన్ అన్నారు. దారి తప్పిన కొందరు పోలీసులు, సీఐడీని జేబు సంస్థగా వాడి తప్పుడు కేసులు, అరెస్టులతో ఎంత భయోత్పాతం సృష్టించారో కూడా ప్రజలంతా చూశారన్నారు. ఆ దారుణాలు, జగన్ తప్పుల కారణంగా నాటి డీజీపీ సహా పోలీసు బాసులు కోర్టు మెట్లెక్కడాన్నీ అంతా గమనించారన్నారు. ఆ దుర్మార్గాలను భరించలేకనే వైకాపాను ప్రజలను 11 సీట్లతో భూమిలో పాతిపెట్టారన్నారు. ఇన్ని దారుణాలు చేసిన దుర్మార్గుడు అమాయక చక్రవర్తిలా నటిస్తూ దుష్ప్రచారాలు చేస్తే ఎలా అని ఎద్దేవా చేశారు.

## విజయవంతంగా కొనసాగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదు

**◆హర్షం వ్యక్తం చేసిన టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమా**

విజయవాడ (చైతన్యరథం) : టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతంగా నడుస్తోందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు వ్యాఖ్యానించారు. మంగళవారం సెంట్రల్ నియోజకవర్గంలోని 23వ డివిజన్ లెనిన్ సెంటర్ నందు టీడీపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలుగుదేశంపార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం 2024-26 విజయవంతంగా నడుస్తోందని, కొత్త సభ్యత్వాల నమోదుతో పాటు మీ పాత సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోడానికి కూడా ఇదే సరైన సమయమని అన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం 100 రూపాయలు చెల్లించి తీసుకుంటే 5 లక్షల ప్రమాద బీమా, పిల్లల చదువుకి ఆర్థిక సాయం, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు వంటి ప్రయోజనాలు కల్పిస్తున్నామని అన్నారు. పార్టీ కార్యకర్తలను కుటుంబ సభ్యులుగా భావించి, వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ, అందుకే దేశంలో ఏ పార్టీకి లేనంత అభిమానబలం తెలుగుదేశానికే ఉందని, సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదలైయ్యాక ఒక్క ఆంధ్రప్రదేశ్ లోనే 9 రోజుల్లోనే 11 లక్షల సభ్యత్వాలకు చేరడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకుని టీడీపీ కుటుంబ సభ్యులుగా చేరాలని ఆయన కోరారు.



## పేదలకు సీఎంఆర్ఎఫ్ ఒక వరం

**◆సీఎంఆర్ఎఫ్ నుంచి రూ. లక్షా 80 వేలు అందజేసిన ఎంపీ కేశినేని శివనాథ్**



విజయవాడ (చైతన్యరథం): పేదలకు సీఎంఆర్ఎఫ్ పథకం ఒక వరమని, అత్యవర సమయాల్లో ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని విజయవాడ టీడీపీ ఎంపీ కేశినేని శివనాథ్ వ్యాఖ్యానించారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 52వ డివిజన్, మల్లిఖార్జున పేట, బ్రాహ్మణ వీధికి చెందిన గుర్రం నరేంద్రకి బైక్ యాక్సిడెంట్ కారణంగా కాలర్ బోన్ ఆపరేషన్ , బ్రెయిన్ సర్జరీ నిమిత్తం తక్షణ ఆర్థిక సాయం కింద సీఎంఆర్ఎఫ్ (ఎల్.వో.సి) కి ఎంపి కేశినేని శివనాథ్ సాయంతో ఆర్జీ పెట్టుకున్నారు. స్పందించిన ముఖ్యమంత్రి కార్యాలయం రూ. ఒక లక్షా 80 వేల రూపాయల ఎల్‌వోసిని మంగళవారం బాధితుడి తండ్రి నాగేశ్వరరావు, పిన్ని భవానీకి ఎంపి కేశినేని శివనాథ్ అందజేశారు. బాధితుడి కుటుంబ సభ్యులు ఎంపి కేశినేని శివనాథ్ కి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# ఇష్టానుసారంగా ప్రైవేట్ ఆస్తుల స్వాధీనం కుదరదు

## ◆'సుప్రీం' చారిత్రాత్మక తీర్పు



న్యూఢిల్లీ: ప్రైవేటు ఆస్తుల స్వాధీనం విషయంలో సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. ప్రైవేటు యాజమాన్యంలో ఉన్న అన్ని ఆస్తులను ఉమ్మడి ప్రయోజనం కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు వీలులేదని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. 8:1 మెజారిటీతో సుప్రీంకోర్టు ఈ తీర్పును ఇచ్చింది. సీజేఐ జస్టిస్ చంద్రచూడ్‌తో పాటు మరో ఆరుగురు న్యాయమూర్తులు ఒకటి.. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సుధాన్షు ధూలియా వేర్వేరుగా మూడు తీర్పులను రాశారు.

సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సుధాన్షు ధులియా, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ ఎస్సీ శర్మ, జస్టిస్ ఏజీ మసీష్ రాజ్యాంగ ధర్మాసనం పిటిషన్లపై విచారణ జరిపి తీర్పును వెలువరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 39(బి) ప్రకారం ప్రతి ప్రైవేటు ఆస్తిని కమ్యూనిటీ ఆస్తిలో భాగంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. చట్టాలు, విధానాల రూపకల్పనలో రాజ్యాంగం నిర్దేశించిన మార్గదర్శకాలను ప్రభుత్వాలు పాటించాలని ఈ ఆర్టికల్ చెబుతుందని.. ప్రైవేట్ యాజమాన్యంలోని ఆస్తులు ఉమ్మడి ప్రయోజనాల కోసం ప్రభుత్వాలు స్వాధీనం చేసుకోవచ్చని.. కానీ, ఒక వ్యక్తికి చెందిన ప్రతి వనరునూ ఉమ్మడి ప్రయోజనంగా పరిగణించబడదని.. అది భౌతిక అవసరాలకు తగినదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

దాంతో సుప్రీంకోర్టు 1978 నాటి ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 4:3 మెజారిటీతో ఇచ్చిన తీర్పును పక్కనపెట్టింది. ఉమ్మడి ప్రయోజనాల కోసం ప్రభుత్వం అన్ని ప్రైవేట్ ఆస్తులను స్వాధీనం చేసుకోవచ్చని పేర్కొంది. ప్రత్యేక ఆర్థిక, సామ్యవాద భావజాలం స్ఫూర్తితో ప్రభుత్వం ప్రైవేట్ ఆస్తులను స్వాధీనం చేసుకోవచ్చని ఏడుగురు న్యాయమూర్తుల మెజారిటీ నిర్ణయం పేర్కొంది. సర్వోన్నత న్యాయస్థానం తాజా తీర్పుతో ప్రైవేట్ యాజమాన్యాల అన్ని వనరులను ఇకపై ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు వీలుండదు.

సుప్రీంకోర్టు తొమ్మిది మంది న్యాయమూర్తుల ధర్మాసనంలో ఇద్దరు న్యాయమూర్తులు భిన్నమైన నిర్ణయం తీసుకున్నారు. బెంచ్ నిర్ణయాన్ని జస్టిస్ బివి నాగరత్న పాక్షికంగా విభేదించగా, జస్టిస్ సుధాన్షు ధులియా పూర్తిగా విభేదించారు. రాజ్యాంగం ప్రకారం, ఉమ్మడి ప్రయోజనాల కోసం ప్రైవేట్ యాజమాన్యంలోని అన్ని వనరులను స్వాధీనం చేసుకునే హక్కు ప్రభుత్వాలకు లేదని మంగళవారం 7:2 మెజారిటీ నిర్ణయంలో సుప్రీంకోర్టు పేర్కొంది. అయితే, కొన్ని కేసుల్లో ప్రభుత్వాలు ప్రైవేట్ ఆస్తులను క్లెయిమ్ చేసుకోవచ్చని సీజేఐ నేతృత్వంలోని తొమ్మిది మంది న్యాయమూర్తుల ధర్మాసనం పేర్కొంది.

# ఏడాది తర్వాత రాజకీయాలకు శరద్‌పవార్ గుడ్‌బై?



ముంబై: ప్రముఖ రాజకీయ నాయకుడు, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ-ఎస్పీ) చీఫ్ శరద్‌పవార్ రాజకీయాల నుంచి వైదొలగడంపై కీలక వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన ఓ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. రాజ్యసభలో తన పదవీకాలం ఇంకా ఏడాదిపాటు ఉందని ఇది ముగిసిన అనంతరం మరో పదవిలో కొనసాగాలా వద్దా అనే విషయంపై నిర్ణయం తీసుకుంటానని ఆయన పేర్కొన్నారు. కాగా ఇప్పటికే శరద్ పవార్ పాల్గొంటున్న పలు సభల్లో ఆయన వ్యతిరేకులు ఇకనైనా రాజకీయాల నుంచి రిటైర్ కావాలని ప్లకార్డులు ప్రదర్శించడంపై పవార్ స్పందించారు. ఎవరైనా ఎక్కడో ఒకచోట ఆగిపోవాల్సిందే కదా అంటూ వ్యాఖ్యానించారు.

నవంబర్ 20న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్సీపీ(ఎస్పీ) అభ్యర్థి యుగేంద్ర పవార్ తన పెదనాన్న అజిత్ పవార్‌తో తలపడనున్నారు. దీంతో శరద్ పవార్ తన మనవడు యుగేంద్ర తరఫున ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలో అజిత్ పవార్ 25 ఏళ్లకు పైగా పనిచేశారని, ఆయన సేవలపై ఎలాంటి సందేహం లేదని అన్నారు. అయితే ఇప్పుడు భవిష్యత్తు కోసం సిద్ధం కావాల్సిన సమయం వచ్చిందని, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే కొత్త నాయకుడు అవసరమని ఆయన అన్నారు. రాబోయే 30 ఏళ్లు పనిచేసే నాయకత్వాన్ని మనం తయారుచేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఐదు దశాబ్దాలకు పైగా మహారాష్ట్ర రాజకీయాల్లో ప్రముఖ రాజకీయ నాయకుడిగా సేవలందించిన శరద్ పవార్ భారత రాజకీయాల్లోనూ కీలకపాత్ర పోషించారు. పార్లమెంటరీ రాజకీయాల నుంచి ఆయన తప్పుకుంటే ఆ ప్రభావం మహారాష్ట్ర రాజకీయాలపై కూడా ఉంటుంది.

ఇదిలావుండగా రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు మహారాష్ట్ర సిద్ధమవుతోంది. 288 మంది శాసనసభ్యులున్న మహారాష్ట్రలో నవంబరు 20న ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. నవంబరు 23న ఫలితాలను ప్రకటించనున్నారు. ప్రస్తుతం బీజేపీ, శివసేన, ఎన్సీపీలతో కూడిన మహాయుతి ప్రభుత్వం అధికారంలో ఉంది. ఈ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించి మళ్లీ అధికారంలోకి రావాలని కాంగ్రెస్, ఎన్సీపీ (ఎస్పీ), శివసేన (యూబీటీ)లతో కూడిన ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ కూటమి ప్రయత్నిస్తోంది.



# 25 నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాల తేదీలు ఖరారయ్యాయి. నవంబర్ 25 నుంచి సమావేశాలు ప్రారంభం కానున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మంగళవారం ప్రకటించారు. డిసెంబర్ 20 వరకు ఈ సమావేశాలు కొనసాగనున్నట్లు తెలిపారు. ఈ మేరకు పార్లమెంట్ ఉభయ సభలను సమావేశపరచాలనే ప్రభుత్వ ప్రతిపాదనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు.

అదేవిధంగా భారత రాజ్యాంగాన్ని ఆమోదించి ఈ నవంబర్ 26 నాటికి 75 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఆ రోజు పార్లమెంట్ ఉభయసభల ప్రత్యేక సంయుక్త సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కిరణ్ రిజిజు తెలిపారు. 1949 నవంబర్ 26న రాజ్యాంగ సభ మన రాజ్యాంగాన్ని ఆమోదించిన న్యూఢిల్లీలోని సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో ఉభయ సభల సభ్యులు సమావేశం కానున్నారు. కాగా ఇదివరకూ నవంబర్ 26ను జాతీయ న్యాయ దినోత్సవంగా నిర్వహించేవారు. కానీ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125వ జయంతిని పురస్కరించుకొని 2015 నుంచి నవంబర్ 26ను కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ దినోత్సవంగా ప్రకటించిన విషయం తెలిసిందే.

ఇదిలావుండగా ఈ శీతాకాల సమావేశాల్లో జమిలి ఎన్నికలు, వక్ఫ్ సవరణ బిల్లు మొదలైనవి సభ ముందుకు రాబోతున్నట్టు తెలిసింది. ఈ సమావేశాల్లోనే వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదింపజేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇప్పటికే ప్రకటించారు. గురుగావ్ ఎన్నికల ప్రచారంలోనూ ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. మరోవైపు విపక్షాలు జమిలి ఎన్నికలు, వక్ఫ్ సవరణ బిల్లు-2024ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. దీంతో విపక్షాలు, అధికార ఎన్డీయే కూటమి సభ్యుల మధ్య పార్లమెంట్‌లో వాడి వేడి చర్చ సాగే అవకాశం ఉంది.

# కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు హైకోర్టు నోటీసు



బెంగళూరు: ముడా భూముల కేటాయింపు కేసు మలుపులు తిరుగుతూ ముప్పుతిప్పలు పెడుతోంది. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఆయన భార్య, ఇతరులపై నమోదైన ఈ కేసును సీబీఐకి బదిలీ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై కర్ణాటక హైకోర్టు సిద్ధరామయ్యకు మంగళవారం నోటీసులు పంపింది. స్నేహమయి కృష్ణ వేసిన ఈ పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, సీబీఐ, లోకాయుక్త పోలీసులకు హైకోర్టు నోటీసులు పంపింది. లోకాయుక్త పోలీసులు ఇంతవరకూ చేసిన దర్యాప్తునకు సంబంధించిన వివరాలను నవంబర్ 25వ తేదీలోగా తమకు సమర్పించాలని కూడా కోర్టు కోరింది. తదుపరి విచారణను నవంబర్ 26వ తేదీకి వాయిదా వేసింది.

ముడా భూముల కేటాయింపుల వ్యవహారంపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సెప్టెంబర్ 27న కోర్టు ఇచ్చిన ఆదేశాలతో మైసూరు లోకాయుక్త పోలీసులు అధికారికంగా కేసుపై దర్యాప్తు జరుపుతున్నారు. సిద్ధరామయ్య భార్యకు రూ.56 కోట్ల విలువచేసే 14 స్థలాలను ముడా కేటాయించడంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై లోకాయుక్త విచారణ జరుపుతోంది. మైసూరు సిటీలోని ఖరీదైన ప్రాంతంలో అక్రమంగా సిద్ధరామయ్య భార్యకు 14 స్థలాలను ముడా కేటాయించినట్టు ఆరోపణలున్నాయి. కేసు విచారణలో భాగంగా ఇటీవల సిద్ధరామయ్య భార్య పార్వతిని ముడా పోలీసులు ప్రశ్నించారు. ఈనెల 6వ తేదీన తమ ముందు హాజరుకావాలని సిద్ధరామయ్యకు సైతం మైసూరు లోకాయుక్త సోమవారం నోటీసులు పంపింది. నోటీసులు తనకు అందాయని, 6వ తేదీన విచారణకు హాజరవుతానని సిద్ధరామయ్య ధ్రువీకరించారు. ముడాకు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సైతం అక్టోబర్ 28న మంగళూరు, బెంగళూరు, మాండ్య, మైసూరు సహా కర్ణాటకలోని ఆరుచోట్ల గాలింపు చర్యలు చేపట్టింది. ముడాతో అసోసియేషన్ ఉన్న ఆరుగురు ఉద్యోగులకు సమన్లు పంపింది. సిద్ధరామయ్య, ఆయన భార్యతో సహా పలువురిపై మనీ లాండరింగ్ కింద ఈడీ కేసు నమోదు చేసింది.

# ఆదివాసులను అణచివేస్తున్న జెఎంఎం ప్రభుత్వం

## ◆రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విమర్శ

రాంచీ: ఝార్ఖండ్‌లో అధికారంలో ఉన్న జేఎంఎం నేతృత్వంలోని ప్రభుత్వం ఆదివాసీలను అణచివేస్తోందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) అధినేత హేమంత్ సోరెన్ నేతృత్వంలోని ఇండియా కూటమి టపాసులా పేలితే.. భాజపా శక్తిమంతమైన రాకెట్లా దూసుకెళ్తూ రాష్ట్రాన్ని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని అన్నారు. హటియాలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. సోరెన్ ప్రతిపాదకుడు మండల్ ముర్ము బీజేపీలో చేరిన విషయంపై



మాట్లాడుతూ జేఎంఎం మునిగిపోతున్న నావ అని తెలుసు కాబట్టే అతడు తమ పార్టీలో చేరారని అన్నారు. ఇదంతా చూస్తుంటే రాష్ట్రంలో ఎవరు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారో స్పష్టమవుతోందని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ప్రభుత్వం ఆదివాసీలను అణచివేస్తూ.. వారి ప్రయోజనాలకు విరుద్ధంగా పనిచేస్తోందని దుయ్యబట్టారు. చొరబాటుదారులు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని, ఆదివాసీ జనాభా తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీకి అధికారం ఇస్తే ఝార్ఖండ్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రాల వరుసలో నిలబెడతామని హామీ ఇచ్చారు. 2027 నాటికి అమెరికా, చైనాల తర్వాత భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. 81 మంది సభ్యులున్న ఝార్ఖండ్ అసెంబ్లీకి నవంబర్ 13, 20 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరగనుండగా.. నవంబర్ 23వ తేదీన ఫలితాలు వెల్లడికానున్నాయి.

# మదర్సాలపై 'సుప్రీం' కీలక తీర్పు

న్యూఢిల్లీ: మదర్సాల విషయంలో సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. మదర్సాల నిర్వహణకు సంబంధించి ఉత్తరప్రదేశ్ బోర్డ్ ఆఫ్ మదర్సా ఎడ్యుకేషన్ యాక్ట్ 2004 రాజ్యాంగ విరుద్ధమంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఈ చట్టం రాజ్యాంగబద్ధమేనని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. అంతేకాదు.. విద్యా సంస్థలు స్థాపించి, నిర్వహించే హక్కులను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవద్దని తేల్చి చెప్పింది. విద్యా హక్కు చట్టం 2004లో కూడా ఇందుకు సంబంధించి కొన్ని మినహాయింపులు ఉన్నాయని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. దేశ సర్వోన్నత న్యాయస్థానం తీర్పుతో ఉత్తరప్రదేశ్‌లోని 16 వేల మదర్సాలలో చదువుకుంటున్న 17 లక్షల మంది విద్యార్థులకు భారీ ఊరట కలిగినట్లయ్యింది. ఉత్తరప్రదేశ్ బోర్డ్ ఆఫ్ మదర్సా ఎడ్యుకేషన్ యాక్ట్ 2004 రాజ్యాంగ విరుద్ధం అంటూ అలహాబాద్ హైకోర్టు కొట్టివేయడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో కొందరు పిటిషన్ దాఖలు చేశారు. మంగళవారం దీనిపై విచారించిన ధర్మాసనం.. హైకోర్టు తీర్పును తోసిపుచ్చింది. భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జేబీ పార్డీవాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం హైకోర్టు తీర్పును తప్పుపట్టింది.